క్లుప్తంగా

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్‌నాయక్

కొడంగల్ : విద్యార్థులు కష్టపడి చదవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు విజయం సాధించాలంటే ఈ దశలోనే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు బాల్య దశ నుంచి యువ్వనంలోకి అడుగు పెట్టేది ఇంటర్‌లోనే అన్నారు. ఈ సమయంలో విద్యార్థులు క్రమ శిక్షణ పాటించి ఉత్తమ పౌరులుగా మారాలని సూచించారు. జీవితంలో విద్యార్థులు ఏ రంగంలో స్థిరపడాలంటే పునాది ఇక్కడి నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పండరితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరుతున్న యువకులు

బషీరాబాద్: బీజేపీకి చెందిన పలువురు యువకులు తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని బాద్లాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు శ్రీకాంత్, సాయిసంపత్ కావాలి నరోత్తం, మెట్టు హన్మంతు, నవీన్, ప్రభాకర్, దేవర శ్రీనివాస్, ప్రదీప్, మహేసత్, నవీన్, విక్రంతో పాటు పలువురికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు తథ్యమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు గల్లంతు కావాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు శ్రీశైల్‌రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అతిథి గృహంలో నీటి కొరత



నీటి కొరత ఉన్న గెస్టు హౌస్

కొడంగల్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నీటి కొరత ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు కొడంగల్‌కు వస్తే ఉండడానికి ఏర్పాటు చేసిన విడిది గృహంలో నీటి కష్టాలు తప్పడం లేదు. అతిథి గృహంలో నీటి అవసరాల కోసం గతంలో వేసిన బోరు పని చేయడం లేదని, మిషన్ భగీరథ నీరు రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు అతిథిగృహానికి వస్తే చేతులు కడుక్కోడానికి కూడా నీళ్లు లేవని వాపోయారు.

ముమ్మరంగా అన్నదానాలు

ధారూరు: మండల కేంద్రంలో గురువారం వినాయకుల మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగాయి. శ్రీ వీరభద్రేశ్వస్వామి దేవాలయంలో, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, ఎస్సీ కాలనీలో అన్నదానాలు కొనసాగాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సామూహిక వినాయకుల ఊరేగింపు కొనసాగనుంది. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఇంతకుముందు నిమజ్జన సమయంలో మత ఘర్షణలు చోటు చేసుకున్నందున పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్ష

అనంతగిరి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం ఏడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ.. కేంద్రం వెంటనే వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టి చట్టబద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టి తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్, పుష్పరాణి, సుభాష్, మహేందర్, నర్సింలు, శ్రీనివాస్, రాములు, శేఖర్, శాంత తదితరులు పాల్గొన్నారు.



తాండూరు పట్టణంలోని శాంతి నగర్ వినాయక పూజల్లో పాల్గొన్న మహిళలు

– తాండూర్ టౌన్

బిల్లులు వచ్చేదెన్నడో?

- బకాయిలు అందక సర్పంచుల ఆందోళన
- బంగారం తాకట్టు పెట్టి మరీ అభివృద్ధి
- పట్టించుకోని అధికారులు



దోమ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచులు

దోమ: సర్పంచ్‌గా బరిలో గెలిచారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా.. అప్పులు చేసి, ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టి మరీ అభివృద్ధి పనులు చేస్తున్నారు. కానీ, పనులు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం మాత్రం బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. గత 19 నెలలుగా బిల్లులు రాక నానా అవస్థలు పడుతున్నామని, పరిస్థితి ఇలాగే ఉంటే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడే విధంగా ఉన్నాయని ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లుల పెండింగ్..

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో ఆయా అభివృద్ధి పనులను సర్పంచులు చేపట్టారు. పనులు చేసి డబ్బుల కోసం నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. ఎన్నికలు జరిగి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా చేసిన పనులకు 19 నెలలుగా బిల్లులు రాక అప్పులపాలవుతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనునిత్యం కార్యాలయాల చూట్టూ బిల్లుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరో పక్క గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులు సర్పంచులను హెచ్చరిస్తున్నారు. దీంతో చేసేది లేక వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేపడుతున్నామని సర్పంచులు చెబుతున్నారు. తెచ్చిన అప్పులు కట్టలేక, వడ్డీలు పెరిగి తీవ్ర ఒత్తిడి గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

ఎస్టీఓలో నిలిపివేత

15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ ద్వారా సర్పంచులు గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, పల్లె ప్రకృతి వనం, క్రీడాప్రాంగణంతో పాటు వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. ఆ బిల్లులను ఇంజనీరింగ్ అధికారులు ఎంబీ రికార్డు పూర్తి చేసి ఏఈ, డీఈఈ, ఎంపీడీఓ ద్వారా ఎస్టీఓకు పంపిస్తారు. ఆ నిధుల బిల్లులు చెల్లింపులు మాత్రం నెలలు గడుస్తున్నా రావడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తాయని సంబంధిత అధికారులను అడిగితే , అధికారులు పొంతనలేని సమాధానం చెబుతున్నారని సర్పంచులు అంటున్నారు. ఎస్టీఓకు వెళ్లి అడిగితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపి వేశామని చెబుతున్నారని సర్పంచులు వాపోతున్నారు.

అధికార పార్టీ సర్పంచుల పరిస్థితి దయనీయం

అధికారర పార్టీ సర్పంచుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మిగతా సర్పంచుల మాదిరిగానే అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదు. దీంతో అప్పులు తెచ్చి పనులు చేపట్టారు. కానీ వారి ఇబ్బందులను బయటకు చెప్పుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారంలో తమ పార్టీ ఉన్నప్పటికీ చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆ కష్టాలు బయటకు చెబితే నాయకులు ఆగ్రహానికి గురవుతారేమోనని భయాందోళన చెందుతున్నారు.

బిల్లులు రావడం లేదు



గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు రాక ఎదురు చూస్తున్నాం. బిల్లుల చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రూ. కోటికి పైగా సొంత డబ్బులు వెచ్చించి గ్రామంలో అభివృద్ధి పనులను చేశాం. అయినా నేటికి బిల్లులు రాలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– కె.రాజిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు, దోమ

అప్పులు తెచ్చి పనులు చేశాం



గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అప్పులు తెచ్చి చేశాం. నెలలు గడుస్తున్నా బిల్లులు రావడం లేదు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. బంగారం తాకట్టు పెట్టి చెల్లించాల్సి వస్తుంది. అధికారులు బిల్లులను వెంటనే చెల్లిస్తే తెచ్చిన అప్పులను తీర్చుకోవడానికి ఎంతో వీలుంటుంది. లేని పక్షంలో ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

– లక్ష్మణ్ నాయక్, సర్పంచ్, గొట్లచెల్కతండా

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే



గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ చేయకపోవడం ద్వారానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిల్లులను నిలిపివేశాం. ప్రతి గ్రామంలో సర్పంచులు అవెన్యూ ప్లాంటేషన్‌లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేస్తే బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జయరాం, ఎంపీడీఓ, దోమ

పేద విద్యార్థులకు సహకారం



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న శైలేందర్‌రెడ్డి

దోమ : గ్రామాల్లో పేద విద్యార్థుల చదువులకు కమతం రాంరెడ్డి ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తామని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు శైలేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాకొండ గ్రామానికి చెందిన కొత్త అంజిలయ్య కూతురు అనూష హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థి ఇబ్బందులను తెలుసుకున్న ట్రస్ వ్యవస్థాపకులు శైలేందర్‌రెడ్డి బుధవారం విద్యార్థికి ల్యాప్‌టాప్‌అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివే దిశ ముందుకు సాగాలని విద్యార్థికి సూచించారు. అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం గ్రామంలో అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్న పలువురిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాకొండ మాజీ సర్పంచ్ వెంకటయ్య, ట్రస్ట్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాంచంద్రయ్య, మజ్జిగ రాములు, పిల్లి వెంకటయ్య, అంజిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

దోమ: మండలంలోని బొంపల్లిలో వీఆర్ఏ వుల్లయ్య తల్లి చంద్రకంటి మొగులమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు సహాయం అందజేశారు. అలాగే, గ్రా మానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ అంతిరెడ్డి రూ. 2500, సర్పంచ్ సురేష్ రూ.2000, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గండెరాములు, బాల్‌రాజు, రాములు, మహేష్, శ్రీనివాస్, తదితరులున్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ



పెద్దేముల్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కుల్కచర్ల: ఇంటితో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించడం వల్ల పల్లెలన్నీ ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. అలాగే, తడి, పొడిచెత్తను వేర్వేరుగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా మీ సేవా ర్యాలీ

పెద్దేముల్: మండలంలోని హన్మాపూర్, బుద్దారం, అడ్కిచెర్ల, బండపల్లి, నాగులపల్లి, జనగాం, పెద్దేముల్, ఇందూరు, కొండాపూర్, రెగోండి, ఆత్కూర్, తట్టెపల్లితో పాటు పలు గ్రామాల్లో గురువారం జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ (గామీణ్) స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు విధుల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని చెత్త చెదారాన్ని తొలగించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిదుద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఏఎన్ఎంలు పంచాయతీ కార్యదర్శులు, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

లోకల్ కూరగాయలతో ఆరోగ్యం

సీడీపీఓ వెంకటేశ్వరమ్మ



మాట్లాడుతున్న సీడీపీఓ వెంకటేశ్వరమ్మ

ధారూరు: గ్రామీణ ప్రాంతాల్లో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలే ఆరోగ్యాన్ని కాపాడుతాయని సీడీపీఓ వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని రాజాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణమాసం, అన్నప్రాసనతో పాటు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. స్థానికంగా ఇవి తక్కువ ధరకే దొరుకుతాయని, ఆర్థికంగా కొంతమేరకు లాభపడతారని అన్నారు. 6 నెలలు దాటిన పిల్లలందరికీ ప్రత్యేక పోషకాహారం ఎలా ఇవ్వాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు లక్ష్మయ్య, సూపర్‌వైజర్లు సుశీల, శాంతాబాయి, నర్సమ్మ, కళావతి, పాఠశాల హెచ్ఎం సరస్వతీ, పంచాయతీ కార్యదర్శి, గర్భిణిలు, బాలింతలు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

కాంగ్రెస్ నాయకుడు గోపాల్



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

పెద్దేముల్: రాబోయే ఎన్నికల్లో తాండూరులో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని బుద్దారం, ఇందూరుతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ, బూత్‌కమిటీ సభ్యులను నియమించారు. కాంగ్రెస్ పార్టీకి పెద్దేముల్ మండలం కంచుకోటలాంటిదన్నారు. పార్టీ నుంచి ఎవరు పోటీ చేసినా భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘం మాజీ చైర్మన్ ఇందూరు నరేందర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు నసీర్ , తట్టెపల్లి ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, నాయకులు ఎల్లారెడ్డి, బంద్యప్ప, రియాజ్, ప్రవీన్‌కుమార్, దాసరి నర్సిములు, ఆనందచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



లక్నాపూర్ ప్రాజెక్టు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పరిగి: గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని పరిగి సీఐ వెంకటరామయ్య సూచించారు. గురువారం మండలంలోని లక్నాపూర్ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లక్నాపూర్ ప్రాజెక్టులో గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రతి రోజు నిమజ్జనాలు ఉంటాయి, కావునా నిత్యం ప్రాజెక్టు వద్ద అధికారుల తనిఖీలు నిర్వహిస్తారు. నిమజ్జనానికి వచ్చిన వారు పోలీసుల, అధికారుల సలహాలు, సూచనాలను పాటించాలని తెలిపారు. రక్షణ వలయం లోపలనే నిమజ్జనం చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సాయం కావాలన్నా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దానయ్య, మున్సిపల్ కమిషన్ శ్రీనివాసన్, ఎస్సై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు



క్రీడాకారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడాపోటీల్లో ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాల నుంచి 6మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి జోనల్ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చాటి జిల్లా స్థాయికి ఎంపికకావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎంపికైన వారిలో ఆకాశ్, శ్రీకాంత్, బబ్లు, విశాల్, శృతి, అఖిల ఉన్నారు. కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు భాస్కర్, చందర్, అరవింద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత లేదు

- దళితబంధు అధికార పార్టీ నేతలకే ఇస్తున్నారు
- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ అశోక్‌రెడ్డి మండిపాటు
- మా ప్రభుత్వం, మా కార్యకర్తలకే ఇస్తామని సర్పంచ్‌పై జెడ్పీటీసీ ఆగ్రహం
- మిన్నకుండిపోయిన అధికారులు



సర్వసభ్య సమావేశంలో పథకాలపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ అశోక్ రెడ్డి

దోమ: ప్రభుత్వం అందజేస్తున్న పథకాల్లో అధికారులు పారదర్శకత పాటించడం లేదని దొంగ ఎన్కేపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనసూయ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి హాజరు కాగా, మొత్తం 23 అంశాలను చర్చించాల్సి ఉంది. అధికారుల ఉదాసీనత కారణంగా కొన్ని అంశాలను మాత్రమే చర్చించి మమ అనిపిస్తున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు సకాలంలో రాకపోవడం, సభలో వివిధ అంశాలను చర్చించలేకపోవడం వల్ల గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించలేక పోతున్నామని అధికారులపై సర్పంచులు, ఎంపీటీసీలు మండిపడుతున్నారు.

జెడ్పీటీసీ వివాదాస్పద వ్యాఖ్యలు!

సభలో దొంగఎన్కేపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి గ్రామాల్లో ప్రభుత్వ పథకాల పంపిణీలో పారదర్శకంగా జరగడం లేదని ఆరోపించారు. అర్హులైన వారికి పథకాలు ఇవ్వకుండా, ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్న వారితో పాటు అధికార పార్టీ నేతలకే దళితబంధు, గృహలక్ష్మి, బీసీ బంధును ఇస్తున్నారని ప్రశ్నించారు. జోక్యం చేసుకున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి మాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పథకాలను ఇప్పిస్తామంటూ సర్పంచ్‌పై వాగ్వాదానికి దిగారు. అడిగే అధికారం నీకు లేదంటూ ఫైర్ అయ్యారు. ఏదైనా ఉంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకో అంటూ ఆక్రోశంతో సమాధానం చెప్పారు. దీంతో సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు నిరుపేదలను అందించాలని కోరితే ఇష్టానుసారంగా మాట్లాడడం ఏంటని మండిపడ్డారు. కార్యకర్తలపై ప్రేమలు ఉంటే బీఆర్‌ఎస్ పార్టీ నిధుల నుంచి పథకాలను ప్రవేశ పెట్టి కార్యకర్తలకు ఇవ్వండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా నియంతలా వ్యవహరిస్తే గ్రామ గ్రామాన నిజమైన లబ్ధిదారులకు మద్దతుగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ అంశాలపై సంబంధిత అధికారులు మాట్లాడారు.

మిన్నకుండిపోయిన అధికారులు

సభలో జెడ్పీటీసీ, సర్పంచ్ వాగ్వాదానికి దిగితే అధికారులు మిన్నకుండిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు నేతలు మధ్య ప్రభుత్వ పథకాలపై వాగ్వాదం చోటుచేసుకుంటే అధికారులు మౌనంగా కూర్చోవడం ఎంత వరకు సమంజసమని సర్పంచులు, ఎంపీటీసీ మండిపడుతున్నారు. అధికార పార్టీకి అధికారులు వత్తాసు పలుకుతున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మండల స్థాయి అధికారుల పనితీరుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అనంతగిరి: మహిళలు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ సూచించారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని ధర్మవిద్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ కింద నియోజకవర్గ మహిళలకు ట్రైనింగ్ ఇచ్చి 60 మందికి ఉచిత కుట్టుమిషన్లు , సర్టిఫికెట్లు అందజేశారు. కుట్టుమిషన్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలను వంటింటికి పరిమితం చేయకుండా వారిలోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, పీఏసీఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దీప భక్తవత్సలం , వైస్ చైర్మన్ మేక శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ స్వాతి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టికెట్ నాకే ఇవ్వండి



విలేకరులతో మాట్లాడుతున్న సుజాత

తాండూరు టౌన్ : తాండూరులో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే ఇవ్వాలని ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్వ సుజాత అన్నారు. గురువారం తాండూరులో ఆమె కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీరాంరెడ్డి, భీమయ్య, కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, తాండూరు స్థానికురాలిగా, ఆర్యవైశ్య బిడ్డగా, ఓ మహిళగా ఎమ్మెల్యే టికెట్ తనకే ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచి, బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఏమాత్రం అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. అధిష్టానం తనకు అవకాశమిస్తుందని, తాండూరు ప్రజల మద్దతు తనకు ఎల్లవేళలా ఉండాలన్నారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కల్వ సుజాత ఎంతో కృషి చేశారని ఆమెకు టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. సీఎం అభ్యర్థిగా రేవంత్ రెడ్డిని బలపరిచే వ్యక్తికే తాండూరు టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు చెప్పారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



వేలాడుతున్న తీగలను చూపుతున్న శ్రీకాంత్

మర్పల్లి: వ్యవసాయ పొలాల వద్ద కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను ఆ శాఖ అధికారులు సరిచేయాలని రైతులు కోరుతున్నారు. తమ పొలంలోని వైర్లను సరిచేయాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని అల్లాపూర్‌కు చెందిన గేటు శ్రీకాంత్, గూడెం నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం పొలం వద్ద షాక్‌కు గురై మండలంలోని బూచన్‌పల్లికి చెందిన లసుంపురం రాజిరెడ్డి మృతి చెందారని గుర్తు చేశారు. బుధవారం సిరిపురంలో తెగి పడిన విద్యు త్ తీగకు తగిలి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం శివ్వన్నగూడేనికి చెందిన వలస కూలీ గోవింద్‌నాయక్ మృత్యువాత పడ్డాడని మండిపడ్డారు. ఇప్పటికైనా పొలాల వద్ద వేలాడుతున్న తీగలను సరిచేయాలని కోరారు.